నేడు డయల్ యువర్ డీఎం

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు తెలుసుకోవడానికి నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం సుధాకర్ తెలిపారు. ప్రయాణికులు శుక్రవారం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959226152 నెంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు సమస్యలుంటే తెలిపాలని కోరారు.

ముదిరాజ్ సమాజ్ వెబ్‌సైట్ ప్రారంభించిన ఎంపీ ఈటల



మేడ్చల్‌రూరల్: ముదిరాజ్ సమాజ్ వెబ్‌సైట్, కేలండర్‌లను గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పూడూర్ గ్రామ పరిధిలోని తన నివాసంలో తెలంగాణ ముదిరాజ్ సమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు దారం యువరాజు ముదిరాజ్ రూపొందించిన ముదిరాజ్ సమాజ్ వెబ్‌సైట్‌ను ముదిరాజ్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు రాజు, సంతోష్, చిరంజీవి, స్థానిక నాయకులు మర్కంటి నాగరాజు పాల్గొన్నారు.

వలలో చిక్కుకొని వ్యక్తి మృతి

శామీర్‌పేట్: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన ఘటన గురువారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... శామీర్‌పేట గ్రామానికి చెందిన కొంగ బాలనరసింహ (66) చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. కాగా రెండు రోజుల క్రితం (మంగళవారం) బాలనరసింహ బంధువుల ఇంటికి వెళ్లాడు. అతడి కుమారుడు బాలకృష్ణ బంధువులకు ఫోన్ చేసి తన తండ్రి ఇంకా ఇంటికి రాలేదని అడుగగా బుధవారం ఇంటి నుంచి వెళ్లాడని బదులిచ్చారు. దీంతో అనుమానం వచ్చిన బాలకృష్ణ గురువారం ఉదయం తన తండ్రి నిత్యం చేపలు పట్టే స్థలానికి వెళ్లి చూడగా అక్కడ బట్టలు కనిపించడంతో చుట్టుపక్కల గాలించగా చేపలు పట్టే వలలో చిక్కుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న శామీర్‌పేట పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారీ అండీ.. ఇంట్లోని డబ్బులు ఖర్చు చేశా!

అలియాబాద్‌లో వివాహిత ఆత్మహత్య

శామీర్‌పేట్: సారీ అండీ ఇంట్లో డబ్బులు ఖర్చు చేశా. పిల్లలని, మా అమ్మనాన్నలను మీరే చూసుకోండి. నన్ను క్షమించండి అని సూసైడ్ నోట్ రాసి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పోలీస్ స్టేషన్, అలియాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... శామీర్‌పేట మండలం, అలియాబాద్ గ్రామానికి చెందిన భీమిరెడ్డి నాగిరెడ్డికి పావని (25)తో ఎనిమిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు (7), ఒక కూతురు (5) ఉన్నారు. పావని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా పోలీసులకు ఇంట్లో లభ్యమైన డైరీలో సూసైడ్ నోట్ లభ్యమైంది. భర్తకు తెలియకుండా డబ్బులు వాడుకొని భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అందులో రాసి ఉంది. కాగా ఘటనపై పోలీసులు విచారణ జరుపగా సుమారు రూ.30 వేల నగదు ఖర్చు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హారిక తెలిపారు.

రహదారుల విస్తరణతో...

మారనున్న రాంపల్లి రూపురేఖలు

- 6 రహదారులు.. రూ. 254 కోట్ల వ్యయం
- శరవేగంగా కొనసాగుతున్న రోడ్డు పనులు
- 6నెలలలోపే పూర్తి చేయాలని ఆదేశాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న పరిసర ప్రాంత ప్రజలు



శరవేగంగా కొనసాగుతున్న రాంపల్లిచౌరస్తా - ఘట్‌కేసర్ యనంపేట రహదారి విస్తరణ పనులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిచౌరస్తా నుంచి - యనంపేట వరకు, రాంపల్లి - చర్లపల్లి వివిధ ప్రధాన రహదారుల విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో ఏళ్లతరబడి రహదారుల బాగుకోసం వేచిచూసిన ప్రజల కల నెరవేరడంతోపాటు, ఇక్కడి ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి. రాష్ట్ర రాజధానికి కూత వేటుదూరంలో ఉన్న నాగారం మున్సిపాలిటీ పరిధిలో గత పదేళ్లకాలంగా గృహ నిర్మాణాలపరంగా శరవేగంగా అభివృద్ధి చెందడంతోపాటు వందల సంఖ్యలో కాలనీలు వెలిశాయి. దీంతో రాంపల్లి-ఘట్‌కేసర్ ప్రధాన రహదారి, రాంపల్లి -చర్లపల్లి, రాంపల్లి -కరీంగూడ రహదారులగుండా వాహనాల రాకపోకలు పెద్దసంఖ్యలో పెరిగిపోయాయి. కానీ ఏళ్ల తరబడి ఇక్కడి రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో ఈ రహదారుల్లో తరచూ ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోవడం జరుగుతుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చర్లపల్లిలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన కొత్త రైల్వేస్టేషన్ నిర్మించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రయాణికులు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్‌కు సాఫీగా ప్రయాణికులు చేరుకోవాడానికి రాష్ట్రం ప్రభుత్వం ఇక్కడి రహదారులను విస్తరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో హెచ్‌ఆర్‌డీసీఎల్ ద్వారా చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సులువుగా ప్రయాణికులు చేరుకునే విధంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 6 రహదారులను రూ. 254 కోట్ల నిధులను వెచ్చించి రాంపల్లిచౌరస్తా నుంచి -ఘట్‌కేసర్ యనంపేట వరకు , రాంపల్లి- చర్లపల్లి బీఎస్ఎన్ఎల్ వరకు, రాంపల్లి- కరీంగూడ ఓఆర్ఆర్, రాంపల్లి-సాయిగూడెం ఓఆర్ఆర్, దమ్మాయిగూడ రోస్ గార్డెన్ నుంచి నాగారం వరకు, నాగారం డబుల్‌బెడ్‌రూం నుంచి యంనంపెట్ వరకు రోడ్డు విస్తరణ పనులను చేపడుతుంది. దీంతో రాంపల్లి చౌరస్తా నుంచి - ఘట్‌కేసర్ యనంపేట వరకు, రాంపల్లి-చర్లపల్లి వరకు రహదారుల విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో పక్క రాంపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి యనంపేట రహదారి, సాయిగూడెం నుంచి రాంపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు, రోడ్డుకు ఇరువైపులా కంకర వేసే పనులు, రోలింగ్ పనులు జోరందుకున్నాయి. ప్రస్తుతం ఉన్న రహదారులను 100 అడుగుల రహదారులుగా విస్తరించడంతోపాటు, నాలుగులైన్ల రహదారులుగా విస్తరించి రోడ్డు మధ్యలో డివైడర్, చెట్లు, వీధిదీపాల ఏర్పాటు, రెండువైపులా వాకింగ్ ట్రాక్ తదితర పనులను చేపట్టనున్నట్లు హెచ్‌ఆర్‌డీసీఎల్ సంస్థ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. 4 నుంచి 6 నెలలలోపే రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో అధికారులు పనులు చేపడుతున్నారు. రాంపల్లిచౌరస్తా నుంచి యనంపేట వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఇక్కడి ప్రాంతం రూపు రేఖలు మారనున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రధాన రహదారి వెంట పెద్దపెద్ద వాణిజ్య సముదాయాల నిర్మాణాలు కూడా ఏర్పాటు కావడంతో, త్వరలో రాంపల్లి పెద్ద సిటీగా మారనున్నడంతోపాటు, సమీప గ్రామాల్లో కూడా నివాస ప్రాంతాలు విస్తరించే అవకాశాలున్నాయని పేర్కొంటున్నారు. త్వరలో చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి పూర్తిస్థాయి లో రైల్వే రాకపోకలు కొనసాగనున్నట్లు అధికారులు కూడా ప్రకటించడం కూడా ఇక్కడి ప్రాంత అభివృద్ధికి దోహదపడనున్నది. ఏదీఏమైనప్పటికి తమ ప్రాంత రహదారులు బాగుపడుతుండటంతో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల ప్రజలతోపాటు, రాంపల్లి, కరీంగూడ, యనంపేట, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఈ ప్రాంతంలో పెద్దఎత్తున అభివృద్ధి



రాంపల్లి చౌరస్తా-ఘట్‌కేసర్ ప్రధాన రహదారి, రాంపల్లి చర్లపల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులు పూర్తయితే ఇక్కడి ప్రాంతం వాణిజ్యపరంగా, నివాస ప్రాంతంగా కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి చెందనున్నది. ఇప్పటికే రాంపల్లి- చర్లపల్లి రహదారిలో పెద్ద ఎత్తున కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఇక్కడ ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాంపల్లి పట్టణంగా మారనున్నడంతో ఇక్కడి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

-పంబాల సరితా రమేష్ ,
నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్

ప్రమాదాలు తగ్గుతాయి



ఏళ్ల నుంచి రాంపల్లి చౌరస్తా -ఘట్‌కేసర్‌యనంపేట , రాంపల్లి-చర్లపల్లి రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో తరచూ ఈ రహదారుల్లో ప్రమాదాలు చోటుచేసుకునేవి. ఈ రహదారి విస్తరణ పనులు పూర్తయితే రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశాలున్నాయి.

-ఎలసాని బాల్‌రాజ్‌యాదవ్,
రాంపల్లి వాసి

సీఎంకు ఆరు గ్యారంటీలను అమలు చేసే బుద్ధినివ్వాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నాగారంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్‌రూరల్: ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చే బుద్ధి కలిగించాలంటూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన నాయకులు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేసే బుద్ధి ఇవ్వాలని, వారి కళ్లు తెరిపించాలని కోరుతూ మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు పథకాలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి హామీల అమలుకు ఏడాది గడువు ఇచ్చామని ఇకపై బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటాలు చేసి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజా క్షేత్రంలో నిలబెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గణేష్, జగన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజు, హేమంత్‌రెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు సంజీవ గౌడ్, నాయకులు బుచ్చయ్య చారి, జనార్ధన్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కీసరలో...

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు నాగారం, రాంపల్లి, గోధుమకుంట, దమ్మాయిగూడ, ఆర్‌జీకేకాలనీ తదితర ప్రాంతాల్లో నిరసన కార్యక్రమంతో పాటు, గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేసే కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నేతలు గండి అంజయ్యగౌడ్ , పరకాల పెంటయ్య, జగన్మోహన్‌రెడ్డి, కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, కొకుట్ల అనంతరెడ్డి, మోకు రేణుక, కొకుట్ల మమతకృష్ణారెడ్డి, ఆకిటి మహేందర్‌రెడ్డి, అన్నంరాజు లావణ్య, నాగేష్‌గౌడ్, క్యాసారం అశోక్‌గౌడ్, రామ్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా ఆంగ్లం పోటీల్లో ఆరిష్ ప్రతిభ

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి సిద్దార్థ్‌అద్వాయ్ ఆరిష్ వెంగలపూడి ఆలిండియా ఇంగ్లిష్ చాలెంజ్ పరీక్షలో జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన అభినందన సభలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ ఎ. దినకర్‌బాబు



చేతులమీదుగా ల్యాప్‌టాప్, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఆరిష్ చిన్నతనం నుంచే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆంగ్లంపై దృష్టి సారించి ఒలింపియాడ్స్‌లో పాల్గొని ఈ ఘనత సాధించాడని కొనియాడారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ ఏ. మురళిముకుంద్ మాట్లాడుతూ ఆరిష్ భవిష్యత్తులో ఇలాంటి బహుమతులను మరెన్నో పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ జి. శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ బి. పద్మజరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శామీర్‌పేట్: ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి అన్నారు. గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మూడు చింతలపల్లి మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే బుద్ధి వారికి ఇవ్వాలంటూ గాంధీ విగ్రహానికి రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చేయకుండా మోసం చేసిందన్నారు. రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు జనవరి 26న అమలు చేస్తామని ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లేష్‌గౌడ్, మూడు చింతలపల్లి గ్రామ మాజీ సర్పంచ్ జాం రవి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పావనీజంగయ్య



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న పావనీజంగయ్య

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని, హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటుపోతుందని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా, గృహజ్యోతి పథకాలను అర్హులకు అందజేస్తున్నామన్నారు. పెన్షన్లు పెంచే యోచనలో ప్రభుత్వముందని, ప్రతి వార్డులో ఇందిరమ్మ కమిటీల ద్వారా పేదలను గుర్తించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఇచ్చిన ఆరు హామీల్లో 4 పథకాలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్ ముదిరాజ్ డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, యూత్ కాంగ్రెస్, మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, అంజిరెడ్డి, జంగయ్య యాదవ్, మల్లేశ్, రవీందర్, నర్సింగ్‌రావు, శివ ప్రదీప్‌రెడ్డి, నరేశ్‌గౌడ్, ఖయూమ్, రహీం, మల్లేశ్‌యాదవ్, సాయి చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

శిలాఫలకాలపై మహిళా కౌన్సిలర్ల భర్తల పేర్లు



మెట్టు నర్సింహారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగిన ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాలపై మహిళా కౌన్సిలర్ల భర్తల పేర్లను లిఖించడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెట్టు నర్సింహారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం జోడిమెట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోచారం పురపాలక సంఘ పాలకవర్గం ప్రొటోకాల్ నిబంధనలను పాటించకుండా శిలాఫలకాలను ఏర్పాటు చేసిందని ఆరోపించారు. అంతేగాక స్థానిక కౌన్సిలర్ పేరును చాలా పెద్ద అక్షరాలతో రాయించారని చెప్పారు. నూతన పాలకవర్గం ఏర్పడే వరకు తమ పెత్తనమే చెల్లుబాటవుతుందని తాజాగా మాజీలైన కొందరు కౌన్సిలర్లు ప్రచారం చేసుకుంటూ దీమాగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇక మీదట మున్సిపాలిటీతో ఏవిధమైన పని చేయించుకోవాలన్నా ప్రజలు నేరుగా సంబంధిత అధికారులనే సంప్రదించాలని సూచించారు.

ఎన్ఎన్ఆర్‌జీలో 'క్లీనోవేషన్ ఫర్ స్వచ్ఛత'



క్లీనోవేషన్‌లో ఎన్ఎన్ఆర్‌జీ విద్యార్థులు, అధ్యాపకులు

పోచారం: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సి.వి కృష్ణారెడ్డి అన్నారు. చౌదరిగూడలో నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో 'క్లీనోవేషన్ ఫర్ స్వచ్ఛత' పేరుతో గురువారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. కళాశాల ఆవరణతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో శ్రమదానం చేసి స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.వి. కృష్ణారెడ్డి మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే రోగాలు దరిచేరవని సూచించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతోపాటు పరిసరాల వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీపీఓ కె. శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎం.సతీష్ కుమార్, కోఆర్డినేటర్ బి.కృష్ణ, డీన్లు, హెచ్ఓడీలు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్ మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలు



జాబితాను ప్రదర్శిస్తున్న మండల పరిషత్ అధికారులు

మేడ్చల్: పట్టణీకరణ భాగంలో మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్, గౌడవెల్లి, పూడూర్ గ్రామాలు మున్సిపాలిటీలలో విలీనం కావడం మండల పరిషత్ అధికారులు నూతన ఎంపీటీసీ స్థానాలను రూపొందించి జాబితాను గురువారం ప్రకటించారు. గతంలో మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ప్రస్తుతం 7 స్థానాలను ఏర్పాటు చేశారు. డబీల్‌పూర్-1, లింగాపూర్ డబీల్‌పూర్ కొంతభాగంను కలిపి డబీల్‌పూర్ -2, మైసిరెడ్డిపల్లి, నూతన్‌కల్, కోనాయిపల్లిలను కలిపి నూతన్‌కల్‌గా, రాజబొల్లారం, రాజబొల్లారం తండాలను కలిపి రాజబొల్లారం స్థానంగా, ఎల్లంపేట్, సోమారం, సైదనిగడ్డతండాలను కలిపి ఎల్లంపేట్ స్థానంగా , రావల్‌కోల్, శ్రీరంవరం గ్రామాలను ఒక్కో స్థానంగా మొత్తం మండలంలోని 7 ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వసంతలక్ష్మి తెలిపారు. ఈ మేరకు జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ప్రదర్శించామని ఏలాంటి అభ్యంతారాలు ఉన్న కార్యాలయంలో తెలపాలని అన్నారు.



రావల్‌కోల్‌లో...



జవహర్‌నగర్‌లో...



ఘట్‌కేసర్‌లో...

గాంధీజీకి ఘన నివాళి

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. యువత గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని కోరారు. ముఖ్యంగా గాంధీ సూచించిన శాంతి, అహింసా మార్గాలను పాటించాలన్నారు. - మేడ్చల్



గాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



పోచారం మున్సిపల్ ఆఫీస్‌లో...



కీసరలో..



మేడ్చల్...

ఎంపిక చేసిన ప్రశ్నలను చదివితే పరీక్షలు ఈజీ

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



హాజరైన విద్యార్థులు



మాట్లాడుతున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మేడ్చల్: విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దని, ఎంపిక చేసుకున్న ప్రశ్నలను మాత్రమే చదివితే పరీక్షలు ఈజీ అవుతాయని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో కొత్త పెన్నులు ఎట్టి పరిస్థితిలలో ఉపయోగించవద్దని అన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమానుల సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై మేడ్చల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పరీక్షలు రాజే రోజు శుభదినమని, అనవసర భయాలకు పోయి పరీక్షలంటే భయపడవద్దని అన్నారు. పరీక్షలు రాసే సమయంలో కొన్ని పేజీలు రాసిన పెన్నులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు. పాత పెన్ను చేతికి అనువుగా ఉండటంతోపాటు, ఇంక్ ఫ్లోయింగ్ సరిగా, క్లియర్‌గా ఉంటుందని అన్నారు. విద్యార్థులు చదివే సమయంలో మెదడు, కళ్లు, మనసును సంధానం చేసి చదివితే ప్రశ్నలు, జవాబులు సులువుగా అనిపిస్తాయని అన్నారు. పరీక్షలు రాసిన తర్వాత ఎలా రాశామని పోస్టుమార్టం చేసుకోవద్దని దాని వల్ల అనవసర ఒత్తిడి పెరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఆయన సుదీర్ఘంగా మాట్లాడి పిల్లలకు పరీక్షలపై పూర్తి అవగాహన కలిపించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు గిరిబాబు, ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, సభ్యులు స్వామిదాస్, మంజుల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.